ప్రధాన రోడ్లపై చెత్త కుప్పలు

- ఏలూరులో వర్షాలు పడితే దుర్గంధం
- శానిటేషన్‌పై శ్రద్ధ చూపని అధికారులు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో ప్రధాన రోడ్లపై చెత్త, వ్యర్థాలు డంపింగ్ చేస్తున్నారు. కొన్ని ప్రధాన రహదారుల పక్కగా వెళ్లాలంటేనే ముక్కుపుటాలు పగిలిపోయే దుర్గంధం వెదజల్లుతున్నాయంటూ జనం భయాందోళన చెందుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ఇళ్లలోని చెత్తా, వ్యర్థాలను ఒకచోట డంపింగ్ చేస్తూ ఉండడంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రవాతావరణం ఏర్పడుతోంది. దీనిపై ఏలూరు నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

వర్షం పడితే చిత్తడే

ఏలూరు నగరంలో ప్రధాన రోడ్లన్నీ అపరిశుభ్రంగా మారాయి. ఏలూరు పత్తేబాద డీ మార్ట్ ఎదురు రోడ్డు, అశోక్‌వర్ధన్ స్కూల్ ప్రాంతంలో రోడ్లపైనే చెత్తా, వ్యర్థాలు వేయటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పిల్లల ఆరోగ్యంపైనా ప్రభావం పడుతుందని ఆందోళన చెందుతున్నారు. ఎస్‌ఆర్‌పేటలో జూనియర్ కళాశాలలు ఉండే ప్రాంతంలోనూ వ్యర్థాలను రోడ్లపైనే డంపింగ్ చేస్తూ ఉండడంతో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఆర్‌ఆర్‌పేట, పవర్‌పేట, వన్‌టౌన్ మార్కెట్ ఏరియాలు చెత్తతో నిండిపోతుంది. వర్షాలు పడితే చిత్తడిగా మారి మరింత దుర్గంధం వెదజల్లుతున్నాయి. దోమలు విజృంభించటంతోపాటు, ప్రజలు అనారోగ్యం బారిన పడేందుకు


ఏలూరు పత్తేబాద దీమార్ట్ ఎదురు రోడ్డులో ఉన్న చెత్త


ఏలూరు అశోక్ వర్ధన్ స్కూల్ సమీపంలో ఉన్న చెత్త, వ్యర్థాలు

కారణంగా మారుతుందని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇంటింటా చెత్త సేకరణ

ఏలూరులో గత ప్రభుత్వం హయాంలో క్లాప్ ప్రోగామ్‌లో భాగంగా ఇంటింటా చెత్తను సేకరించంతోపాటు వాటిని నగరపాలక సంస్థ డంపింగ్‌కు తరలించేవారు. ప్రతి ఇంటి నుంచీ సాధారణంగా రూ.60 వరకు వసూలు చేసేవారు. ప్రధాన రహదారుల్లో చెత్త వేస్తే, ఆయా ప్రాంతాల్లో చెత్త వేయకుండా నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక శ్రద్ధతో మొక్కలు నాటటం, ఐరన్ మెస్ కట్టించి, రంగురంగుల డిజైన్లు వేయించి ఆహ్లాకరంగా మార్చేవారు. గతంలో ఎక్కువగా చెత్తా, వ్యర్థాలు వేసే ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి మరీ చెత్త వ్యర్థాలు వేయకుండా నిరంతర నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేసేవారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యాలయంలోనే సీసీ కెమెరాల నిఘా విభాగంలో పర్యవేక్షణ చేసేందుకు సిబ్బందిని నియమించారు. కానీ నేడు ఎక్కడ చూసినా చెత్తా, వ్యర్థాలు రోడ్లపైనే దర్శనం ఇస్తూ ప్రజలను తీవ్ర అసౌకర్యానికి గురి చేస్తున్నాయి.

శానిటేషన్‌పై శ్రద్ధ లేదు



ఏలూరు నగరంలో అపరిశుభ్ర వాతావరణంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలం సమీపిస్తున్న తరుణంలో దోమలు పెరిగిపోయి, ప్రజలు అనారోగ్యం బారినపడే అవకాశం ఉంది. నగరపాలక సంస్థ అధికారులు నగరంలో శానిటేషన్‌పై శ్రద్ధ వహించాల్సి ఉంది. – వైఎస్‌వీ శివరావు, ఏలూరు

ఇంటింటా చెత్త సేకరణ నిల్



కూటమి ప్రభుత్వం హయాంలో ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పక్కన పెట్టేయడంతో ప్రజలు ఇబ్బందులుపడుతున్నారు. రోడ్లపైనే శానిటేషన్ సిబ్బంది చెత్త డంప్ పెడుతూ ఉండటంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారుతుంది.
– పి.రాజేష్, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

క్లుప్తంగా

యోగా శిక్షణా తరగతులు


యోగాసనాలు వేస్తున్న సిబ్బంది

దెందులూరు: వ్యక్తిగత ఆరోగ్య పరిరక్షణ ద్వారానే కుటుంబం ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందని ఏలూరు ఎంపీడీఓ కె.శ్రీలత అన్నారు. అందరికీ ఆరోగ్యం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మంగళవారం ఏలూరు రూరల్ మండలంలో ఏలూరు ఎంపీడీఓ కార్యాలయంలో పాలగూడెం, గుడివాకలంక గ్రామాల్లో యోగా శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ కార్యాలయంలో యోగా ఇన్‌చార్జి మహ్మద్ నయీం, పాలగూడెంలో యోగా ఇన్‌చార్జి కె.జగదీష్ చంద్రప్రసాద్, గుడివాకలంకలో యోగా ఇన్‌చార్జి ఎ.గిరిష్ ఉద్యోగులకు యోగాలో శిక్షణ ఇచ్చారు.

రేషన్ పంపిణీని సక్రమంగా పూర్తి చేయాలి


జేసీకి పూల మొక్క ఇస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని సక్రమంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి కోరారు. రేషన పంపిణీపై జాయింట్ కలెక్టర్ ధాత్రి రెడ్డి అధ్యక్షతన జిల్లాలోని అన్ని మండలాల రేషన్ డీలర్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. రేషన్ పంపిణీ విధివిధానాలను వివరించారు. రేషన్ పంపిణీ సక్రమంగా పూర్తి చేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని సూచించారు. రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, రాజులపాటి గంగాధర్ గౌడ్, జిల్లా కార్యదర్శి వాసిరెడ్డి నరసింహారావు, ఎ.ఉదయేశ్వరరావు. చింతలపూడి ప్రసాద్ రాజు, రాజశేఖర్, జయరాజు రాంబాబు, అన్వర్ బాషా, కాగిత నాగరాజు పాల్గొన్నారు.

విజయవంతంగా ఉపాధి హామీ పథకం అమలు


వెంకట సుబ్బారావు

ఏలూరు (టూటౌన్): జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నట్టు డ్వామా పీడీ వెంకట సుబ్బారావు తెలిపారు. మంగళవారం స్థానిక డ్వామా కార్యాలయంలో ఉపాధి పథకం అమలు తీరును ఆయన పాత్రికేయులకు వివరించారు. జిల్లాలో గతేడాది కోటి 20 లక్షల పని దినాల లక్ష్యానికి కోటి 23 లక్షల 65 వేల పనిదినాలు కల్పించి 103 శాతం పైగా వృద్ధిని సాధించామన్నారు. ఈ ఏడాది పెరిగిన సరాసరి వేతనానికి అనుగుణంగా రూ.290 తగ్గకుండా వేతనం కల్పించామని తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో నిర్వహించిన పనులకు ప్రస్తుతం రూ.280 సరాసరి వేతనం చెల్లించామన్నారు. ఏప్రిల్, మే, జూన్, జనవరి, ఫిబ్రవరి నెలల్లో పనులు ఎక్కువ జరిగేలా ప్రణాళిక చేశామని తెలిపారు. ఉద్యాన పంటల విస్తరణకు సంబంధించి గత ఏడాది 3,150 ఎకరాలు లక్ష్యంగా తీసుకొన్నామని, ఈ ఏడాది సుమారు 8 ఎకరాల నుంచి 10 వేల ఎకరాలను లక్ష్యంగా పెట్టుకొన్నామని చెప్పారు. గతేడాది పనులు ఎక్కువ చేపట్టడం వల్ల రూ.200 కోట్లు మెటీరియల్ కాంపోండ్ కింద జిల్లాకు లభించిందని తెలిపారు. ఆ నిధులతో జిల్లాలో సీసీ, బీటీ రోడ్లు, పశువుల షెడ్లు, తదితర పనులు చేశామన్నారు. ఉపాధి హామి పనుల్లో తప్పుడు మస్టర్ నమోదు చేస్తున్నారని ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో విచారణకు ఆదేశించామని తెలిపారు. ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా నిర్వహించి, ఎక్కువ మందికి పని కల్పించి, వారు ఆశించిన వేతనలు అందేలా కృషి చేస్తున్నామని పీడీ వివరించారు.

28న బీకేఎంయూ జిల్లా సమితి సమావేశం

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) ఏలూరు జిల్లా సమితి సమావేశం బుధవారం ఏలూరులో నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆర్‌ఆర్‌పేటలో ఉన్న స్ఫూర్తి భవనంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. సమావేశానికి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య హాజరవుతారని తెలిపారు. సమావేశంలో జిల్లాలో ఉపాధి హామీ పథకం అమలు తీరు, వన సంరక్షణ సమితులు స్థితిగతులు, అడవి బంజర్లు, మిగులు భూములు, ఇళ్ల స్థలాల సమస్యలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని వెంకటేశ్వరరావు వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక శనివారపు పేట సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ ఫీడర్లలో వార్షిక మరమ్మతుల నిమిత్తం ఈ నెల 30న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీరాం నగర్, న్యూ అశోక్ నగర్, శాతవాహన నగర్, శాంతి నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం


జిల్లా కారాగారంలో ఖైదీలకు పెట్టే ఆహారాన్ని పరిశీలిస్తున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ అమరావతి వారి ఆదేశాల ప్రకారం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ జిల్లా కారాగారాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కారాగారంలో ఖైదీలకు అందిస్తున్న సౌకర్యాల పైనా ఎప్పటికప్పుడు తనిఖీ నిర్వహించి, సంబంధిత అధికారులకు సూచనలు చేయాల్సిన బాధ్యత జిల్లా న్యాయ సేవాధికార సంస్థ పై ఉందని అన్నారు. అందులో భాగంగా ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని సూచించారు. ఆర్థికంగా వెనకబడి, న్యాయవాదిని నియమించుకోలేని ఖైదీలకు ఉచిత న్యాయ సహాయాన్ని అందిస్తామని తెలిపారు. ఖైదీల కుటుంబ సభ్యులకు ఎటువంటి న్యాయ సహాయం అవసరమైనా జిల్లా న్యాయశాఖ అధికారి సంస్థ ఉచితంగా అందిస్తుందని, ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జైలర్ వెంకటరెడ్డి ప్యానల్ అడ్వకేట్ మధు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు మాతా రమాబాయి ఆదర్శం


మాతా రమాబాయికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): మహిళా లోకానికి ఆదర్శం మాతా రమాబాయ్ అని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మెండెం సంతోష్ కుమార్ అన్నారు. మాతా రమాబాయి వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక నరసింహారావుపేటలోని ఎస్‌సీఆర్‌పీఎస్, ఏఐఏవైఎస్ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. రమాబాయి చిత్రపటానికి సంతోష్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. నాడు రమాబాయి అహోర్నిశలు శ్రమించి బాబా సాహెబ్ అంబేడ్కర్‌ను చదివించడం వల్లే నేడు మహిళలకు సమానత్వం సాధ్యమైందని గుర్తు చేశారు. కులమతాలతో సంబంధం లేకుండా స్త్రీలకు అన్ని హక్కులు కల్పించిన బాబా సాహెబ్ రాసిన రాజ్యాంగాన్ని చదవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో నూకపెయ్యి కార్తీక్, కనికెళ్లి రవి ప్రసాద్, చిలకా సుబ్బారావు, బొల్లారపు నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితేనే ఫలితం


తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట): కష్టపడితే తగిన ప్రతిఫలం దక్కుతుందని, విద్యార్థులు చిన్ననాటి నుంచి కష్టపడి చదివితే ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయని రిసోర్స్ పర్సన్ ఐ.శ్రీనివాసరావు అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా మంగళవారం విద్యార్థులకు శాస్త్రవేత్తలు, రాకెట్స్ ప్రయోగాలు, చంద్రయాన్ గురించి వివరించారు. భారతదేశం ఎంతో మంది గొప్పగొప్ప శాస్త్రవేత్తలను ప్రపంచానికి అందించిందన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం దేశం గర్వించే గొప్ప శాస్త్రవేత్త అని మిస్సైల్ మ్యాన్‌గా ప్రజలచేత గుర్తించబడ్డారని గుర్తుచేశారు. పేద కుటుంబం నుంచి వచ్చి రాష్ట్రపతి స్థాయికి ఎదిగిన మహోన్నత వ్యక్తి కలాం అని వివరించారు. అటువంటి వారిని విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ముందుగా విద్యార్థులచే నీతి కథలు చదివించి, కథలు చెప్పడంలో మెళకువలను నేర్పించారు. అనంతరం తెలుగు పర్యాయ పదాలపై శిక్షణ అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, క్విజ్, పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ ఎ.నారాయణరావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ వీటీ సందీప్ కుమార్, ఎండీ అస్లాం పాషా, ఎం కనకదుర్గ, విద్యార్థులు పాల్గొన్నారు.

అనారోగ్యంతో మహిళ మృతి

ఏలూరు టౌన్: ఏలూరు శివారు వట్లూరు ప్రాంతంలో ఒక మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. దీనిపై స్థానికులు 112కు సమాచారం ఇవ్వడంతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి ప్రాంతానికి చెందిన బొర్రా శ్రీ మహలక్ష్మి (35) భర్తతో విడిపోయి ఒంటరిగా కుమారుడితో కలిసి జీవిస్తుంది. కొన్నేళ్ల క్రితం ఆమె ఏలూరు నగరానికి వచ్చి వట్లూరులో నివాసం ఉంటుంది. ఆమెతో ఒక ఆటో డ్రైవర్ సహజీవనం చేస్తున్నట్లు చెబుతున్నారు. ఆ మహిళ గత కొంతకాలంగా డయాలసిస్ సమస్యతో బాధపడుతుండగా మంగళవారం తెల్లవారుజామున హఠాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో ఆమెను నగరంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆమె అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మహిళ మృతదేహాన్ని ఇంటికి తీసుకురాగా స్థానికులు 112కు సమాచారం అందించారు. త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు ఆదేశాల మేరకు ఎస్సై రాంబాబు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జీజీహెచ్ మార్చురీకి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆమె అనారోగ్య కారణాలతోనే మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

హాస్టళ్లలో విద్యార్థుల సంఖ్య పెంపునకు చర్యలు

జంగారెడ్డిగూడెం: వసతి గృహాల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టామని ఇన్‌చార్జి జేడీ ఎం ముక్కంటి తెలిపారు. మంగళవారం స్థానిక ప్రైవేట్ ఒకేషనల్ కాలేజీలో కొయ్యలగూడెం సాంఘిక సంక్షేమ శాఖ డివిజన్‌లో పరిధిలోని హాస్టల్స్ వార్డెన్లకు, సిబ్బందికి ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. వచ్చే విద్యాసంవత్సరంలో హాస్టళ్లల్లో విద్యార్థుల ప్రవేశాలు పెరిగేలా సిబ్బంది కృషిచేయాలన్నారు. హాస్టళ్లల్లో అవసరమైన సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డివిజన్ పరిధిలో ఉన్న 13 హాస్టళ్లలో ప్రస్తుతం 12 పని చేస్తున్నట్టు చెప్పారు. ఒకటి నిర్వాసిత మండలంలో ఉండటం వల్ల పనిచేయడం లేదన్నారు. ఈ హాస్టళ్ల మరమ్మతులకు రూ.70.85 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. 12 వసతి గృహాల్లో 8 హాస్టళ్లకు సొంత భవనాలు ఉండగా, వాటికి మరమ్మతులు చేసినట్లు తెలిపారు. కాగా 2017లో జంగారెడ్డిగూడెంలో మూతపడిన ఎస్సీ హాస్టల్స్‌ను తిరిగి మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని, జిల్లా కలెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని చెప్పారు. ఈ సందర్భంగా పట్టణంలోని వార్డు సంక్షేమ కార్యదర్శులు సాంఘిక సంక్షేమ శాఖను తమకు మాతృశాఖగా చేసేందుకు అవకాశం కల్పించాలని కోరుతూ ముక్కంటికి వినతి పత్రం అందించారు. కొయ్యలగూడెం ఏఎస్‌డబ్ల్యూఓ ముప్పిడి రాజు పాల్గొన్నారు.

దళిత సంఘాల నిరసన ప్రదర్శన


డీఆర్‌ఓకు వినతి పత్రం అందిస్తున్న దళిత సంఘాల నాయకులు

ఏలూరు (టూటౌన్): దళితులపై దాడులను అరికట్టాలని కోరుతూ ఏలూరు నగరంలోని దళిత సంఘాలు ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఇంజినీరింగ్ విద్యార్థి జేమ్స్‌పై అమానుష దాడిపై వివిధ అంబేడ్కర్ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రముఖ నటుడు మోహన్‌బాబు విద్యాసంస్థలో బీటెక్ విద్యార్థిపై పాశవిక దాడి చేసిన అగ్రకుల దురహంకారులు రూప్ నాయుడు, యశ్వంత్ నాయుడులపై పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పిఠాపురం నియోజకవర్గం మల్లాం గ్రామంలో దళితుల సాంఘిక బహిష్కరణ ఘటనపై స్పందించని డిప్యూటీ సీఎం తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐడీఆర్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్ మణిసింగ్, కులవివక్ష పోరాట సంఘం నాయకులు మంచెళ్ల ఇసాక్, ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘాల జనరల్ సెక్రటరీ డాక్టర్ మెండెం సంతోష్ కుమార్, ఆర్‌పీఐ (ఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మత్తె బాబి, అఖిల భారత దళిత ఫోరం వ్యవస్థాపకుడు, అధ్యక్షుడు నూకపెయ్యి కార్తీక్, దళిత ప్రజాసమితి అధ్యక్షులు కాపు దాసి రవి కుమార్, పల్లా ఏసేబు, అంబేడ్కర్ సంఘం సీఎం మంగరాజు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, కర్టికోటి దిలీప్ మాల మహా సేన డాక్టర్ పెరియార్ పూలే, వివిధ సంఘాలు నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు చేయూత ఇవ్వాలి


దాత అందించిన స్పోర్ట్స్ వేర్‌తో బాలబాలికలు

ఏలూరు రూరల్ : క్రీడాకారులకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని ఏలూరు కస్తూరిబా బాలికల మునిసిపల్ హైస్కూల్ హెచ్‌ఎం జి.సునీత అన్నారు. మంగళవారం స్కూల్‌లో చేపట్టిన వేసవి శిక్షణ శిబిరంలో శిక్షణ పొందుతున్న బాలబాలికలకు సీనియర్ బాస్కెట్ బాల్ క్రీడాకారుడు, పెదవేగి మండలం రామశింగరవరం జెడ్పీహెచ్ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు జమ్మ రామకృష్ణ రూ.20 వేలు ఖరీదు చేసే స్పోర్ట్స్ వేర్ అందజేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ కొన్నేళ్లుగా స్కూల్‌లో సాధన చేస్తున్న బాలికలు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని విజయాలు సాధిస్తున్నారని కొనియాడారు. దాతల బాలికల ప్రతిభ మెచ్చి షూ, స్పోర్ట్స్ వేర్, పౌష్టికాహారం అందిస్తున్నారని తెలిపారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి గవ్వ శ్రీనివాస మాట్లాడుతూ స్కూల్ బాలికలు జాతీయ స్థాయిలో సైతం ప్రతిభ చాటి జిల్లాకు పేరు, ప్రఖ్యాతలు తీసుకొస్తున్నారని కొనియాడారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం 40 మంది బాలబాలికలకు స్పోర్ట్స్ వేర్ అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న టి గోపాల్, ఎం రమేష్, సత్యం జమ్మ రామకృష్ణ సహకారాన్ని కొనియాడారు.

1న బాలు గానలహరి


బాలు గాన లహరి కరపత్రం విడుదల చేసిన అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జూన్ ఒకటో తేదీన స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో బాలు గాన లహరి కార్యక్రమం నిర్వహించనున్నట్టు హేలాపురి సింగర్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు కరపత్రం స్థానిక రామకృష్ణాపురంలోని సాహిత్య మండలి భవనంలో మంగళవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా హేలాపురి సింగర్స్ అసోసియేషన్ కార్యదర్శి ఎస్ రవి మాట్లాడుతూ ఏలూరు పరిసరాల్లోని నూతన గాయకులకు బాలు గారి పాటలు సంగీత వినోదిని పేరుతో ఒకటో తేదీ మధ్యాహ్నం రెండు గంటల నుంచి అవకాశం ఇస్తున్నామన్నారు. జూన్ 4న ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని జూన్ 1న ఆదివారం హేలాపురి సింగర్స్ అసోసియేషన్ గాయకులచే నాలుగు గంటల నుంచి బాలు గాన లహరి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. గాయకులు పి. సూర్య ప్రకాష్, కె.శ్రావణి కుమారి మాట్లాడుతూ బాలు గాన లహరి కార్యక్రమాన్ని కళాభిమానులు, కళాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆలపాటి నాగేశ్వరరావు, గుడిపాటి నరసింహారావులు మాట్లాడుతూ మానవత, వాల్ కైండ్ నెస్, ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం ఈ కార్యక్రమాన్ని ప్రోత్సహిస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు లంకా వెంకటేశ్వర్లు, వివిధ సంస్థలకు చెందిన గరికపాటి కాళిదాసు, బి.ఇమ్మానియేల్, పీవీజీ సత్యవాణి, కేవీ నారాయణరావు, బీఎస్ సాగర్, పుల్లాభొట్ల పురుషోత్తం, మేతర అజయ్ బాబు, బి.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, పి.ఆదిశేషు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏఆర్‌ఎస్‌ఐ కొండలరావు మృతి


కొండలరావు (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు ఏఆర్ యూనిట్‌లో ఎస్సై గొల్ల శ్రీను కొండలరావు మంగళవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. 1989 బ్యాచ్‌కు చెందిన ఆయన సర్వీస్ మొదటి నుంచి ఏలూరు జిల్లా ఏఆర్ విభాగంలోనే పనిచేస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మంగళవారం ఉదయం 6 గంటలకు అనారోగ్యంగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పడంతో ఆయన్ను ఏలూరు జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. హాస్పటల్‌కు చేరుకున్న అనంతరం ఆకస్మికంగా గుండెపోటు రావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఆయన మృతి పట్ల సహచర పోలీసు అధికారులు, సిబ్బంది తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఏఆర్‌ఆర్‌ఐ పవన్‌కుమార్ ఆయన మృతదేహాన్ని పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, పోలీస్ అధికారుల సంఘం నాయకులు, అధికారులు ఆయన భౌతికకాయానికి శ్రద్ధాంజలి ఘటించారు.


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న పవన్‌కుమార్

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు – జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	28
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు – అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	20
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.15	4822	21
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	15
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	14
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	32
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	14
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	20
ఏలూరు – తిరుపతి	16.00	4830	33

ఆయిల్‌పామ్ పంటకు వారం రోజుల్లో నగదు చెల్లించాలి

టి.నరసాపురం: పంట విక్రయం తరువాత వారం రోజుల్లో ధర చెల్లించాలని జంగారెడ్డిగూడెం నవభారత్ ఆయిల్‌ఫామ్ పరిశ్రమ రైతు సంఘం అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ అన్నారు. మంగళవారం మక్కినవారిగూడెంలో ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటను విక్రయించిన తరువాత 14 రోజులకు నగదును చెల్లిస్తున్నారని, దీనిని వారం రోజులకు కుదిస్తే రైతుకు వెసులుబాటుగా ఉంటుందని అన్నారు. ప్రస్తుతం నూనె రికవరీ టన్నుకు 19.36 శాతం ఉండటంతో, తెలంగాణ రైతులకు చెల్లించిన విధంగానే నవభారత్ ధర చెల్లిస్తోందని సూర్యనారాయణ తెలిపారు. కాగా, ఆయిల్‌ఫామ్ గెలలు నరికే సమయంలో పంట పక్వం గురించి రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను చేపట్టాలని కంపెనీని ఆయన కోరారు.

కిన్నెరసాని వాగు వద్ద పికెట్ ఏర్పాటు

కుక్కునూరు: తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల సరిహద్దు మధ్య గల కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలించకుండా సిబ్బందితో పికెట్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తహసీల్దార్ రమేష్ తెలిపారు. తెలంగాణలోని బూర్గంపాడు మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి మరమ్మతుల నిమిత్తం కాంట్రాక్టర్ తెలంగాణ పరిధిలోకి వస్తుందంటూ కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్న విషయంపై కుక్కునూరు రెవెన్యూ, పోలీస్ అధికారులు మంగళవారం సర్వే చేశారు. ఇసుక తరలిస్తున్న ప్రాంతం ఆంధ్రప్రదేశ్ పరిధిలోకి వస్తుందని నిర్ధారించారు. ఇకపై ఆంధ్రా ప్రాంతం నుంచి ఇసుకను తరలిస్తే చట్టపరంగా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఇసుక అక్రమ తరలింపును అడ్డుకునేందుకు పికెట్ ఏర్పాటు చేశామన్నారు.